

మనువాదాన్ని వ్యాప్తి చేస్తున్న..

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తిచేస్తున్నాయని శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఆరోపించారు. - 8లో



సులభతరమైన మూల్యాంకనం..

సులభతరమైన మూల్యాంకనం చేయాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



కట్టంగూర్‌లో కలకలం

జీడిమెట్లలో ప్రియురాలితో కలిసి ఆమె తల్లిని హత్య చేసింది కట్టంగూర్‌వాసే అని తెలియడంతో కలకలం రేగింది. - 8లో

న్యూస్‌రీల్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

రామగిరి(నల్లగొండ) : పాలిసెట్ – 2025 కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైందని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.నరసింహ అన్నారు. నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సిలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని.. కౌన్సిలింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు జూన్ 26 నుంచి జూలై 1వ తేదీ వరకు కాలేజీ ఎంపికకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు.

మహిళలు పొదుపుపై దృష్టి పెట్టాలి

మునుగోడు : మహిళలు సమాఖ్య సంఘాల్లో చేరి తమ ఆదాయంలో కొంత నగదుని పొదుపు చేసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మునుగోడులోని మహిళా సమాఖ్య భవనంలో నూతనంగా ఎన్నికైనా మహిళ సమాఖ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక ప్రోత్సహకాలు అందిస్తోందన్నారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ ఈ.విజయభాస్కర్, ఏపీఎం మేసేశ్వరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు పంతంగి రాధ, కార్యదర్శి బోయపర్తి యాదమ్మ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



చంద్రశేఖర్ తివారిని సన్మానిస్తున్న నాయకులు

నాగార్జునసాగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సంస్థాగత ఎన్నికల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి కోరారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ సంస్థాగత జిల్లాస్థాయి సమావేశం మంగళవారం సాగర్‌లోని విజయ విహార్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలమైన నిర్మాణానికి పునాదులు వేయాలన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు చెల్లని నాణానికి బొమ్మాబొరుసు లాంటివని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కంకణాల నివేదితారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, చనమోని రాములు, ఎస్కే బాబా, వీరారెడ్డి, రామదాసు, తంగరాజు, రాజు పాల్గొన్నారు.

బాలికాసాధికారత సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ

గుర్రంపోడు : కేజీబీవీ విద్యార్థినులు బాగా చదువుకుని ప్రయోజకులై స్వశక్తితో ఎదిగి బాలికా సాధికారతను సాధించే దిశగా ముందుకు సాగాలని జీసీడీఓ కె.అరుందతి ఆకాంక్షించారు. మంగళవారం గుర్రంపోడు కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థిని కనీస సామర్థ్యాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధించాలని టీచర్లకు సూచించారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని.. విద్యార్థినులకు ఇబ్బంది కలగితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. కేర్ టేకర్ రోజూ స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ విజయశ్రీ, సిబ్బంది రాధా, సులోచన, కవిత, ఉమాదేవి, ధనలక్ష్మి, నేహదీప్తి, నీలవేణి, జ్యోతి, కేర్ టేకర్ స్వాతి, ప్రమీల పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : 2025–26 విద్యా సంవత్సరంలో న్యాయవాద వృత్తిలో మూడేళ్ల శిక్షణ కోసం జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీలోగా telanganaepass.cgg.gov.inలో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. హార్డ్ కాపీని వారి బయోడేటా కుల, ఆధాయ ధ్రువీకరణపత్రాలు, డిగ్రీ మార్కుల జాబితా, బార్ కౌన్సిల్ నమోదు పత్రాలు జత చేసి ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సందేహాలు, పూర్తి వివరాల కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

● రైతు భరోసా సంబరాలు



హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా సంబరాల్లో పాల్గొనేందుకు నల్లగొండ నుంచి వెళ్తున్న రైతుల వాహనాలను కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిడమనూరు : రైతు భరోసా సంబరాల్లో భాగంగా నిడమనూరు మండలం ఊట్కూరు రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రైతులు

హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

నల్లగొండ : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగులకు హౌజ్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నల్లగొండలోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ ఇ.రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాకు చెందిన నిరుద్యోగులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ 31 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఉంటాయిన తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ గ్రామీణ యువకులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9701009265 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సంక్షేమం.. గాడిన పడేనా!

ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలతోనే సగం వసతిగృహాలు

- ప్రస్తుతం 13 మినహా అన్ని హాస్టళ్లకు సంక్షేమ అధికారుల నియామకం
- పర్యవేక్షణ పెరుగుతుందని తల్లిదండ్రుల ఆశాభావం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఏళ్ల తరబడి ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొచ్చిన సంక్షేమ వసతిగృహాలకు ప్రభుత్వం కొత్తగా హాస్టల్ వెల్ఫేర్ అధికారులను నియమించింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 13 హాస్టళ్లు మినహా అన్ని వసతి గృహాలకు అధికారులు ఉన్నారు. ఇప్పటివరకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పూర్తిస్థాయిలో లేక ఉన్నవారిలో ఒకొక్కరు రెండు మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిగా వ్యవహరించాల్సి వచ్చింది. వారు రోజూ హాస్టళ్లకు వెళ్లలేకపోవడంతో వంట మనుషులపైనే ఆధారపడాల్సి వచ్చేంది. దీంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడింది. వారు ఏమి చదువుతున్నారో కూడా పట్టించుకునే పరిస్థితి లేకపోయేది. హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రావడంతో వసతి గృహాలు గాడిలో పడతాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల తర్వాత నియామకాలు

హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రిటైర్డ్ అవ్వడమే తప్ప 20 ఏళ్లుగా కొత్తగా రిక్రూట్‌మెంట్ కాలేదు. దీంతో ఇప్పటి వరకు హాస్టళ్లు ఇన్‌చార్జిలతో కొనసాగాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 61 హాస్టళ్లు ఉండగా.. ఇప్పటివరకు 29 మంది మాత్రమే వార్డెన్లు ఉండేవారు. వారిలో ఒకొక్కరికి 2 నుంచి 3 హాస్టళ్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బీసీ, ఎస్టీ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి ఉండేది. ప్రతి వార్డెన్ రోజూ ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం సమయాల్లో హాస్టల్‌కు వెళ్లి అన్నీ చూసుకోవాలి. మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో ఉండడంతో.. రెండు పూటల మాత్రం హాస్టల్‌కు వెళ్లాల్సిందే. కానీ ఒక్కో అధికారికి మూడు హాస్టళ్లను అప్పజెప్పడంతో ఆయన విధులు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ప్రత్యేక రిక్రూట్‌మెంట్‌తో పోస్టులను భర్తీ చేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు చాలా వరకు కొత్తగా అధికారులు వచ్చారు.

వంట మనుషులతోనే నిర్వహణ..

ఇన్‌చార్జి బాధ్యతలు ఉన్న చోట వెల్ఫేర్ అధికారి వంటకు సరిపడా బియ్యాన్ని, కిరాణా సామగ్రిని వంట మనుషులకు అప్పగించి వచ్చేవారు. దాంతో వారు వండి విద్యార్థులకు పెట్టేవారు. అధికారి రోజూ ఒక చోటకు వెళ్లాల్సి వచ్చేది. దీంతోపాటు కార్యాలయాల్లో సమావేశాలు, బిల్లులు పెట్టుకునేందుకు కూడా తిరగాల్సిందే. దీంతో వంట మనుషులే హాస్టల్ నిర్వహణ చూసేవారు.

ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో ఐదుగురి చేరిక

జిల్లాలో 42 గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో 14 ఆశ్రమ పాఠశాలలు. అయితే వీటి పరిధిలో ఆశ్రమ పాఠశాలల హెడ్మాస్టర్లే వార్డెన్లుగా వ్యవహరిస్తారు. మరో 17 హాస్టళ్లకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు. 11 హాస్టళ్లకు అధికారులు లేరు. కొత్త రిక్రూట్‌మెంట్‌తో జిల్లాకు ఏడుగురిని అలాట్ చేయగా అందులో ఐదుగురు మాత్రమే విధుల్లో చేరారు. ఇద్దరు ఇప్పటికే ఇతర ఉద్యోగాల్లో ఉన్నందున వారు విధుల్లో చేరలేదు. దీంతో ఇంకా ఆరు హాస్టళ్లకు ప్రస్తుతం అధికారులు లేరు.

ఎస్సీలో 31 మంది కొత్తగా అలాట్..

జిల్లాలో 61 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉండగా గతంలో 29 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఉండేవారు. ప్రస్తుతం కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా 5వ జోన్‌కు ప్రభుత్వం 54 మంది అలాట్ చేసింది. వారిలో నల్లగొండ జిల్లాలో 31 మంది జాయిన్ అయ్యారు. మిగిలిన వారు జోన్ 5 పరిధిలోని యాదాద్రి, సూర్యాపేట, జనగాం జిల్లాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం దామరచర్ల మినహా అన్ని హాస్టళ్లకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు.

బీసీలో 13 మంది నియామకం

జిల్లాలో 46 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా మొన్నటి వరకు 27 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు. కొత్తగా 13 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రావడంతో 40 హాస్టళ్లకు అధికారులు ఉన్నారు. ఆరు హాస్టళ్లు ఇంకా ఖాళీగానే ఉన్నాయి.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



వైద్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి అందుబాటులో లేకపోవడం, పలు గదులకు తాళాలు వేసి ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. క్వాజువాలిటీ, పురుషులు, మహిళ అత్యవసర వార్డులు, మందుల స్టాక్‌ను తనిఖీ చేశారు. ఇది పీహెచ్‌సీ కాదని ఏరియా ఆస్పత్రి అని.. డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం రూ.32 కోట్లు వెచ్చించి నూతన భవనం నిర్మిస్తున్నందున, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సేవలందించాలని సూచించారు. ఆమె వెంట నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి ఉన్నారు.

టీబీ నివారణపై దృష్టి పెట్టాలి

నల్లగొండ : టీబీ (క్షయ) నివారణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌న్యామె అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శ్రద్ధ పెట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు. రైతులు ఎరువులకు ఇబ్బంది పడకుండా చూడాలని వ్యవసాయ అధికారిని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. అన్ని పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, జిల్లా అటవీశాఖాధికారి రాజశేఖర్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీఏఓ శ్రవణ్‌కుమార్, డీపీఓ వెంకయ్య, హార్టికల్చర్ డీడీ అనంతరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో పేరుకుపోతున్న బియ్యం

- గ్రామీణ రేషన్‌షాపుల్లో అత్యధిక నిల్వలు
- వలస వెళ్లినవారు పట్టణాల్లో తీసుకోవడమే కారణం
- మూడు నెలల సన్నబియ్యం కోటా కూడా మిగిలే అవకాశం
- పురుగు పడుతుందని డీలర్ల ఆవేదన
- అవసరాన్ని బట్టి పంపించాలని కోరుతున్న డీలర్లు



డీఎస్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు (ఫైల్)

నల్లగొండ: గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం పోర్టబులిటీ విధానం అమలవుతుండటంతో పట్టణ ప్రాంతాలకు వలస పోయిన గ్రామీణ ప్రాంత ప్రజలు అక్కడే రేషన్ బియ్యం తీసుకుంటుండడంతో గ్రామాల్లోని రేషన్ షాపుల్లో బియ్యం మిగులుతున్నాయి. ఇదిలా ఉండగా.. ప్రభుత్వం వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించి రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని జూన్‌లోనే ఇస్తోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లో దాదాపు 15 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. వాటిని వెనక్కి తీసుకుపోయే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో డీలర్లు దుకాణాల్లో స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. పాత బియ్యంతో పాటు మిగిలిన సన్న బియ్యం కూడా పురుగుపట్టే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మిగులుతున్న బియ్యం

జిల్లాలో 994 రేషన్ షాపులున్నాయి. వాటి ద్వారా జిల్లాలో 4,84,216 కుటుంబాలకు ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోంది. 3 నెలలకు సంబంధించి సన్న బియ్యం కోటాను ఇప్పటికే పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్ షాపులకు అలాట్ చేశారు. పంపిణీ ప్రక్రియ కూడా దాదాపు 80 శాతం పైచిలుకు పూర్తి కావచ్చింది. ఇప్పటికే ఒక్కో షాపులో దాదాపుగా 10 నుంచి 20 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. వచ్చే 2 నెలలు రేషన్ షాపులు బంద్ ఉంటుండడంతో బియ్యం పురుగు పట్టే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో షాపులకు మొత్తం కోటా కాకుండా తగ్గించి పంపాలని డీలర్లు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో షాపులకు కోటా తగ్గించి సన్న బియ్యం ఇవ్వాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ డీఎస్‌ఓ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు.

నాలుగు ఎకరాలున్నా.. రైతు భరోసా రాలే!

- మహిళా రైతు ఆవేదన



తుమ్మల మల్లమ్మ

చందంపేట : చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామానికి చెందిన తుమ్మల మల్లమ్మకు 4 ఎకరాల భూమి ఉండగా పత్తి విత్తనాలు విత్తింది. గతంలో రైతు బంధు పథకం కింద పంట పెట్టుబడి సాయం పొందింది. కానీ తాజాగా ఆమెకు రైతు భరోసా అందలేదు. తనకున్న నాలుగు ఎకరాలతో పాటు మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని అందులో కూడా పత్తి సాగు చేస్తోంది. ఈ విషయమై ఆమె వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకుండా.. ఆన్‌లైన్ నుంచి భూమి తొలగించారని చెబుతున్నారని మల్లమ్మ వాపోతోంది.

ఇరాన్‌పై దాడిని ఖండించాలి



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఇరాన్‌పై దాడులను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మండలంలోని యాద్గార్‌పల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమెరికా ఇంటిలిజెన్స్ నిఘా వర్గాలు ఇరాన్ వద్ద అణుబాంబులు లేవని స్పష్టంగా చెప్పినప్పటికీ అమెరికా తమ ఆధిపత్యం కోసం ఇరాన్‌పై యుద్ధం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వస్కుల మట్టయ్య, బంటు వెంకటేశ్వర్లు, డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతం రెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్ నాయక్, వరలక్ష్మి, పరశురాములు, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశంతో ఉజ్వల భవిష్యత్



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

నల్లగొండ టూటౌన్ : క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మంగళవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా ఎంతో పేరు వస్తుందన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ అక్బర్ అలీ, పీడీలు కుంభం నర్సిరెడ్డి, విమల, కవిత, నజీర్ పాల్గొన్నారు.

మమ్మల్ని చులకనగా చూస్తున్నారు!

- అన్ని పనులూ తమతోనే చేయిస్తున్నారని మెప్మా మహిళా ఆర్పీల మనోవేదన
- ఉద్యోగులు.. తమపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆరోపణ



నల్లగొండ టూటౌన్ : పట్టణాల్లో సమభావన సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించేందుకు వార్డుల్లో నియమించిన మెప్మా రిసోర్స్ పర్సన్లపై మెప్మా కార్యాలయంలో పని చేస్తున్న సీఓ (కమ్యూనిటీ ఆర్గనైజర్లు)లు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆర్పీలు మనోవేదన చెందుతున్నారు. నెలకు రూ.6వేల గౌరవ వేతనంతో పనిచేసే వారిపై చులకన భావంతో మాట్లాడుతూ హేళన చేయడం పరిపాటిగా మారిందని పలువురు ఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగం ఉద్యోగులు కార్యాలయం గడప దాటకుండా అన్ని పనులూ ఆర్పీలతోనే చేయిస్తూ వారిని ఇబ్బందులు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉద్యోగుల కర్ర పెత్తనం

మెప్మా ఉద్యోగులు పట్టణాల్లో మహిళలను సమావేశ పర్చడం, వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడం, ఇప్పించిన రుణాలను తిరిగి చెల్లించేలా చేయడం లాంటి పనులు చేయాల్సి ఉంటుంది. కానీ అన్ని పనులు వార్డుల్లో ఉన్న మహిళా ఆర్పీలపై నెట్టివేసి మెప్మాలోని ఇద్దరు ఉద్యోగులు వారిపైనే కర్ర పెత్తనం చెలాయిస్తూ సూటి పోటి మాటలతో మానసిక వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాలపై మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఐదు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చినా చిన్న పిల్లలను నిలబెట్టినట్లు నిలబెట్టి కారణాలు చెప్పండంటూ వికృత చేష్టలకు దిగుతున్నట్లు సమాచారం. మెప్మా కార్యాలయంలోని ఓ కీలక ఉద్యోగి మహిళా ఆర్పీలను 'బొంద పెట్ట, దినం చెయ్య.. పిండాలు పెట్ట' అని వ్యాఖ్యలు చేస్తూ వారిని మానసికంగా వేధిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మెప్మా కార్యాలయంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపాలిటీలోని ఓ ఇద్దరు, ముగ్గురు మెప్మా ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పద్ధతి ప్రకారం వ్యవహరించాలి

ఆర్పీలపై అమార్యాదగా మాట్లాడినా, పద్ధతి ప్రకారం వ్యవహరించకున్నా సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలి. తదుపరి విచారణ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సయ్యద్ ముసాద్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ఆర్పీపై పేపర్లు విసిరేసిన మెప్మా ఉద్యోగి..

ప్రతి పది మంది మహిళలు గ్రూపుగా ఏర్పడి బ్యాంకులో ఖాతా తెరుస్తారు. వారిని గ్రూప్‌గా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కూడా మెప్మా ఉద్యోగులదే. సీఓలే వార్డులకు వెళ్లి వారికి రుణం ఇప్పించే బాధ్యత తీసుకోవాలి. కానీ బ్యాంకు రుణం కోసం టూటౌన్ పరిధిలోని ఓ ఆర్పీ మెప్మా కార్యాలయానికి 8 మంది సభ్యులను తీసుకువచ్చి పేపర్లపై సంతకం చేయాలని కోరగా ఇద్దరు సభ్యులు తక్కువగా వచ్చారని, ఆలస్యంగా వచ్చారనే కారణంతో ఆర్పీపై సదరు సీఓ పేపర్లు విసిరికొట్టినట్లు చర్చ జరుగుతోంది. దాంతో ఆమె విలపిస్తూ వెళ్లిపోయినట్లు తెలిసింది. నాలుగు రోజుల కిందట జరిగిన ఈ ఘటన కార్యాలయంలో ఉన్న సీసీ ఫుటేజీలో కూడా రికార్డు అయినట్లు ఆర్పీలు చెబుతున్నారు. ఇటీవల టూటౌన్ పరిధిలోనే ఓ ఆర్పీకి తెలియకుండా సీఓ ఒక సంఘానికి బ్యాంకు రుణం ఇప్పించి చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. తన ప్రమేయం లేకుండా బ్యాంకు రుణం ఇప్పించడంతో సదరు ఆర్పీ మరో 20 మంది ఆర్పీలతో కలిసి విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సీఓను మందలించినట్లు తెలిసింది. దాంతో సదరు సీఓ ఆ 20 మంది ఆర్పీలను టార్గెట్ చేసి బ్యాంకు రుణాల మంజూరు విషయంలో కొర్రీలు పెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం


మహేష్ (ఫైల్)

చండూరు: అప్పుల బాధతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చండూరు మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండల కేంద్రంలోని సర్దార్ కాలనీకి చెందిన అన్నపురెడ్డి మహేష్(30) మద్యానికి బానిసై స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మహేష్ తండ్రి నరసింహ గమనించి అతడిని మొదట నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కను ఢీకొట్టిన బైక్.. మహిళ మృతి

- ఆమె కుమారుడికి గాయాలు


తునిక లక్ష్మి (ఫైల్)

భువనగిరిటౌన్ : తల్లి, కుమారుడు బైక్‌పై వెళ్తుండగా కుక్కను ఢీకొట్టి అదుపుతప్పి కిందపడడంతో తల్లి మృతిచెందింది. కుమారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం రామోజీపేటకు చెందిన తునిక లక్ష్మి(41) భువనగిరి బస్టాండ్‌లో పూల దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం దుకాణం తీసేందుకు గాను ఆమె తన కుమారుడు క్రాంతితో కలిసి బైక్‌పై భువనగిరికి వస్తున్నారు. భువనగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి డిగ్రీ కళాశాల వద్దకు రాగానే రోడ్డుపై అడ్డంగా వచ్చిన కుక్కను ఢీకొట్టి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తునిక లక్ష్మి డివైడర్‌పై పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె కుమారుడు క్రాంతికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రాంతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఊరు నిర్మించిన పాఠశాల

- గ్రామస్తుల విరాళాలతో ఏర్పాటైన వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్
- శ్రమదానం చేసి నిర్మాణంలో పాలుపంచుకున్న ఊరి ప్రజలు
- 36 ఏళ్లుగా ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన పాఠశాల


వట్టిమర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్

చిట్యాల: 36 ఏళ్ల క్రితం ఆ ఊరి ప్రజలంతా కలిసి కొంత నగదును పోగేసి స్వయంగా శ్రమదానం చేసి పాఠశాలను నిర్మించుకున్నారు. అలా ఊరందరి పాఠశాలగా నిలిచిపోయిన ఆ స్కూల్ నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్.

1989లో పాఠశాల నిర్మాణానికి బీజం..

1989లో వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా రాఘవరెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అప్పట్లో ఆ గ్రామం నల్లగొండ శాసనసభ పరిధిలో ఉండేది. గ్రామానికి చెందిన కొందరు అప్పటి సర్పంచ్ రాచమల్ల రామచంద్రం ఆధ్వర్యంలో వట్టిమర్తి గ్రామాభివృద్ధికి సహకరించాలని నకిరేకల్ ఎమ్మెల్యేగా ఉన్న నర్రా రాఘవరెడ్డిని కోరారు. దీంతో తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆయన తలంచారు. గ్రామస్తులంతా కలిసి స్థలం సమకూరిస్తే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి తీసుకొస్తానని రాఘవరెడ్డి హామీనిచ్చారు. అదే సమయంలో నేరడ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చెరుపల్లి సీతారాములు జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేస్తుడంటంతో పాఠశాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామస్తులంతా తమకు తోచినంత నగదు పోగేసి గ్రామంలో నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు.


పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులతో సమావేశమైన నర్రా రాఘవరెడ్డి (ఫైల్)

ఊరందరి శ్రమదానంతో..

పాఠశాల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలంలో గ్రామస్తులంతా శ్రమదానం చేసి పాఠశాల నిర్మాణంలో పాలుపంచుకున్నారు. అలా నిర్మాణం చేసుకున్న పాఠశాలలో తరగతుల నిర్వహణకు నర్రా రాఘవరెడ్డి అనుమతి తీసుకువచ్చారు. పాఠశాల నిర్వహణ కోసం పాఠశాల ఆవరణలోనే పండ్లతోటలు సాగుచేసి ప్రతియేటా ఆదాయాన్ని పొందేట్లుగా తీర్చిదిద్దారు. అయితే 2013లో విద్యార్థులు తగ్గిపోయి ఈ పాఠశాల మూసివేసే పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామానికి చెందిన ఆదర్శ యువజన సంఘం సభ్యులు మరోసారి నర్రా రాఘవరెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో ఆయన ఆయన గ్రామస్తులందరితో సమావేశం నిర్వహించి గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తీర్మానం చేయించారు. దీంతో ఈ పాఠశాల ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఈ జెడ్పీహెచ్‌ఎస్‌లో 80మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఎందరినో ఉద్యోగులుగా తీర్చిదిద్ది..

ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉద్యోగులుగా, మరెందరో ప్రైవేటు రంగంలో ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఈ గ్రామంలో 520 కుటుంబాలుండగా 100 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరిలో డాక్టర్లు, ఎస్‌ఐలు, తహసీల్దార్లు, జడ్జిలు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, విద్యుత్, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

పాఠశాల నిర్మాణంలో పాలుపంచుకున్నా



మా గ్రామస్తులంతా కలిసి శ్రమదానం చేసి అప్పట్లో పాఠశాలను నిర్మించుకున్నాం. ఈ పాఠశాలలో చదువుకున్న వారంతా ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఈ జెడ్పీహెచ్‌ఎస్ నిర్మాణంలో పాలుపంచుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇప్పటికీ ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మంచి విద్యాబోధనను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నారు.

– నర్రా మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వట్టిమర్తి

ఇక్కడ చదవడం నా అదృష్టం



వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో చదవటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇక్కడ పదో తరగతి వరకు చదువుకున్నాను. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులతో పాటు మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాచమల్ల రామచంద్రం, నర్రా మోహన్‌రెడ్డితో పాటు ఎందరో ఉపాధ్యాయులు కృషి చేశారు. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాను.

– బూరుగు శ్రీనివాస్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్

మంచి విద్యాబోధన అందిస్తున్నాం



వట్టిమర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గత రెండేళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఈ పాఠశాల పాఠశాల అభివృద్ధికి గతంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఎంతో కృషిచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులందరం కూడా విద్యార్థులకు మంచి విద్యాబోధన అందిస్తూ మంచి ఫలితాలు సాధించే విధంగా పనిచేస్తున్నాం.

– పందిరి రమేష్, ప్రధానోపాధ్యాయుడు

సులభతరమైన మూల్యాంకనం చేయాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్ : యూనివర్సిటీల్లో అధ్యాపకులు పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా సులభతరమైన మూల్యాంకనం చేయాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలో మంగళవారం ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్వాలిటీ అక్రిడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఫలితాలు, మూల్యాంకనం మెళకువలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్రిడిటేషన్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ పి. రవీందర్‌రెడ్డి అధ్యాపకులకు మ్యాట్రిక్స్ వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల అంజిరెడ్డి, జయంతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, సుధారాణి, రమణారెడ్డి పాల్గొన్నారు.

భళా.. పోచంపల్లి ఇక్కత్ కళ


చేనేత సహకార సంఘంలో వస్త్రాలను పరిశీలిస్తున్న వివిధ దేశాలకు చెందిన అధికారుల బృందం

- పోచంపల్లిని సందర్శించిన వివిధ దేశాలకు చెందిన జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారుల బృందం

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ ఎంతో కళాత్మకంగా ఉందని వివిధ దేశాలకు చెందిన జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారుల బృందం కొనియాడారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో అంతర్జాతీయ శిక్షణ పొందుతున్న నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, తజకిస్తాన్, ఇథియోపియా, కెన్యా, సౌత్ సూడాన్, సెషెల్లస్, మొజాంబిక్, ఉగాండా, ట్యునీషియా, సియ్రా ల్యూనే, లెసొతో, ట్రినిడాడ్ అండ్ టొబాగో, చిలీ దేశాలకు చెందిన 50 మంది జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారులు, జర్నలిస్టులు భూదాన్‌పోచంపల్లిని మంగళవారం సందర్శించారు. టూరిజం పార్కు, చేనేత గృహాలు, మాస్టర్‌వీవర్స్ హ్యాండ్లూమ్ యూనిట్, చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. నూలు వడకడం, చిటికి కట్టడం, రంగులద్దకం, మగ్గాలపై వస్త్రాలను తయారు చేసే విధానాలను ప్రత్యక్షంగా తిలకించారు. సహకార సంఘంలో చేనేత వస్త్రాల నాణ్యత, డిజైన్‌లను పరిశీలించి చేనేత కళాకారుల నైపుణ్యాలను అభినందించారు. పోచంపల్లి ఇక్కత్‌కు అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపును తెలుసుకొని అబ్బురపడ్డారు. ఈ సందర్భంగా మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 28 వరకు ఆయా దేశాలకు చెందిన ప్రభుత్వ ఆర్గనైజేషన్‌లలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు కోర్సు డైరెక్టర్ రావులపాటి మాధవి ఆధ్వర్యంలో ఇండియన్ టెక్నికల్ అకడమిక్ కోఆపరేషన్ సౌజన్యంతో అంతర్జాతీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. అందులో భాగంగా క్షేత్రస్థాయి పర్యటన నిమిత్తం వారు పోచంపల్లికి వచ్చారని తెలిపారు. వీరికి చేనేత జౌళి శాఖ డీఓ రాజేశ్వర్‌రెడ్డి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర అంజనేయులు, కార్మిక సంఘం నాయకులు బొమ్మ హరిశంకర్, భారత భూషణ్, పొట్టబత్తిని వేణు మార్గదర్శకం చేశారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

భువనగిరి: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని యువకులు అపహరించారు. ఈ ఘటన భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగిరి గ్రామానికి చెందిన హేమలత ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తోంది. మంగళవారం సాయంత్రం పని ముగించుకుని పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా.. గుర్తుతెలియని ఇద్దరు యువకులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చి అడ్రస్ అడిగారు. ఈ క్రమంలో ఆమెను బెదిరించి ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌ఓ అనిల్‌కుమార్ తెలిపారు.

ఎద్దుల బండిని ఢీకొని యువకుడి మృతి

మోత్కూరు: బైక్‌పై వస్తూ ఎద్దుల బండిని వెనుక నుంచి ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఎరిక పిచ్చయ్య, జోజమ్మ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు రాకేష్(20) సంతానం. రాకేష్ తనకు వరుసకు సోదరుడైన చుక్క రాజరత్నంతో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. పాటిమట్ల గ్రామం వద్ద ముందు వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొన్నారు. బైక్ నడుపుతున్న రాకేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న రాజరత్నంకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు అతడిని మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాకేష్, రాజారత్నం ఇరువురు హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నట్లు తెలిసింది.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


సత్యరాజును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న ఆదిమల్ల సత్యరాజు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లేపల్లి కాశయ్య తెలిపారు. 27, 28 తేదీల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో సత్యరాజు పాల్గొంటాడని పేర్కొన్నారు. మంగళవారం సత్యరాజును పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

మనువాద సిద్ధాంతం వ్యాప్తి చేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్

సూర్యాపేట: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశంలో మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తిచేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అణిచివేస్తున్నాయని డోర్నకల్ ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ ఎంపీపీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్ననాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఆదివాసీ బునియాది కార్యకర్తల శిక్షణా శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నివర్గాలను సమానంగా ఆదరిస్తుందని అన్నారు. ఆదివాసీల భూములను వారికి అప్పగించే విధంగా కాంగ్రెస్ పార్టీ అనేక చట్టాలను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర చేపట్టారని అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి సెలవు దినంగా ప్రకటించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కృషి చేస్తుందని, కావున కాంగ్రెస్ పార్టీకి అన్నివర్గాలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ బంజారా బిడ్డలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను తెలుసుకోవాలని, అందుకోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ భూక్యా కోటియానాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి లింగంనాయక్, బాబునాయక్, నాగేశ్వర్‌నాయక్, శ్రీను, మల్లికార్జున్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేకలు చోరీ చేస్తున్న నిందితుల అరెస్ట్

కొండమల్లేపల్లి: మేకలు చోరీ చేస్తున్న నలుగురు నిందితులను కొండమల్లేపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇన్‌చార్జి సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం మేగ్యతండాకు చెందిన ఆంగోతు గోపిచంద్, హైదరాబాద్‌లోని కర్మన్‌ఘట్‌కు చెందిన పాడిపాటి స్టాలిన్ అలియాస్ సాయి చరణ్, చింతపల్లి మండలం గొరారం గ్రామానికి చెందిన ఉడుత శివ, మరో బాలుడు కలిసి ఈ నెల 6వ తేదీన కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ఓ మేకల షెడ్‌లో పది మేకలను అపహరించారు. మేకల షెడ్ యజమాని ఫిర్యాదు మేరకు కొండమల్లేపల్లి ఎస్‌ఐ అజ్మీర రమేష్ కేసు నమోదు చేశారు. మంగళవారం కొండమల్లేపల్లి పట్టణంలోని చౌరస్తాలో అనుమానంగా తిరుగుతున్న నలుగురిని పోలీసులు పట్టుకుని విచారించగా.. నిజం ఒప్పుకున్నారు. వీరిపై నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధి 2 కేసులు, గుర్రంపోడులో ఒక కేసు ఉన్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.2.20లక్షల నగదు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యాదగిరీశుడి సేవలో బీసీ కమిషన్ చైర్మన్


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రమేష్‌బాబు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడి సుమారు 40సంవత్సరాలు ఉంటుందని, రెండు రోజుల క్రితమే చెరువులో పడి మృతిచెందినట్లుగా భావిస్తున్నామన్నారు. మృతుడు ఆకుపచ్చ రంగు షర్ట్, నారింజ రంగు బనియన్, నలుపు రంగు ప్యాంట్, బూడిద రంగు బెల్ట్ ధరించినట్లు పేర్కొన్నారు. అతడి రెండు చేతులకు నల్లటి ధారాలు, కుడి చేతికి రెండు ఉంగరాలు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

జీడిమెట్లలో హత్య.. కట్టంగూర్‌లో కలకలం

- ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన అమ్మాయి తల్లిని హత్య చేసిన కట్టంగూర్‌కు చెందిన బాలుడు
- పోలీసుల అదుపులో నిందితుడు

కట్టంగూర్: హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రియురాలితో కలిసి ఆమె తల్లిని హత్య చేసింది కట్టంగూర్‌కు చెందిన బాలుడే అని తెలియడంతో స్థానికంగా కలకలం రేగింది. కట్టంగూర్‌కు చెందిన లక్ష్మమ్మ కుమార్తె చండూరులో నివాసముంటోంది. ఆమె కుమారుడిని చిన్నతనం నుంచే లక్ష్మమ్మ తన వద్దే ఉంచుకుని చదివిస్తోంది. అతడు నల్లగొండలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల రూ.2లక్షలు వెచ్చించి మనవడికి లక్ష్మమ్మ డీజే సామగ్రి ఇప్పించింది. దీంతో సదరు బాలుడు ఇంటర్ చదువుతూనే కట్టంగూర్ మండల కేంద్రంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వెంట షటర్ తీసుకొని డీజే దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడికి ఇన్‌స్టాగ్రాంలో హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన అమ్మాయి పరిచయమైంది. ఈ క్రమంలో ప్రియురాలి ప్రోద్బలంతో జీడిమెట్లలో ఆమె ఇంటికి వెళ్లి ఆమె తల్లిని దారుణంగా హత్య చేశాడు. బాలుడు తన వెంట తన సోదరుడిని కూడా హత్య చేసేందుకు తీసుకెళ్లాడు. గతంలోనే వీరి ప్రేమ విషయం తెలుసుకున్న అమ్మమ్మ పలుమార్లు బాలుడిని మందలించినా వినకుండా అమ్మాయిలో ట్రాప్‌లో పడి దారుణ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. జీడిమెట్ల పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కట్టంగూర్ మండల కేంద్రంలోని విజయవాడ–హైదరాబాద్ సర్వీస్ రోడ్డు వెంబడి ఓ షటర్‌లో ఉన్న బాలుడిని పట్టుకొని తీసుకెళ్తుండగా గ్రామస్తులు చూసి షాకయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉపాధ్యాయుల పిల్లలు

పెన్‌పహాడ్ : తాము విధులు నిర్వహిస్తున్న పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న కొప్పుల శోభ తన చిన్న కుమారుడు సిద్దార్థ ఆర్యన్‌రెడ్డిని అదే పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించింది. శోభ భర్త పరెడ్డి వీరారెడ్డి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే కావడం విశేషం. అదేవిధంగా చెట్లముకుందాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న వేల్పుల జాకోబు రాజకుమార్ తన కుమార్తెను ఎలిజబెత్ అమూల్యను అదే పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు.


పెన్‌పహాడ్: చీదెళ్ల ప్రాథమిక పాఠశాలలో తన కుమారుడితో ఉపాధ్యాయురాలు శోభ


పెన్‌పహాడ్: చెట్లముకుందాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో కుమార్తెతో టీచర్ రాజకుమార్


తుంగతుర్తి : వెంపటి ప్రాథమిక పాఠశాలలో కుమార్తెలను చేర్పించిన ఉపాధ్యాయుడు రవీందర్

కుమారులిద్దరు సర్కారు బడికే..

రాజాపేట : రాజాపేట మండలంలోని సింగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న చిలివేరు సుప్రియ తన ఇద్దరు కుమారులు విశాల్, వివేక్‌ను మంగళవారం రఘునాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. సుప్రియన కుటుంబంతో కలిసి రఘునాథపురం గ్రామంలోనే నివాసముంటోంది. ఆమె కుమారులు గతంలో భువనగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదవగా.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. మండల విద్యాధికారి చందా రమేష్, ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్ సుప్రియను, ఆమె భర్త రమేష్‌ను అభినందించారు.

ఇద్దరు కుమార్తెలు తన వెంటే..

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లెపాక రవీందర్ తన ఇద్దరు కుమార్తెలకు తాను చదువు చెప్పే పాఠశాలలోనే అడ్మిషన్ తీసుకున్నారు. పెద్ద కూతురు మాన్విజ్ఞను రెండేళ్ల క్రితమే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా.. ఆమె ప్రస్తుతం ఫస్ట్ క్లాస్ చదువుతోంది. రెండో కుమార్తె అద్విత కోసం అదే పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు వెంకటరామనరసమ్మ వద్ద అడ్మిషన్ తీసుకున్నారు.


రాజాపేట: రఘునాథపురం ఉన్నత పాఠశాలలో తన కుమారులను చేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుప్రియ